క్లుప్తంగా

బాలల ఆరోగ్యంతోనే ప్రగతి



గన్నవరంరూరల్: బాలల ఆరోగ్యంతోనే ప్రగతి ముడిపడి ఉందని ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తగూడెం ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులకు, బాలలకు అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న ఆహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమానికి సంబంధించిన పిల్లల హెల్త్ కార్డులు పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హెచ్‌ఎం శైలజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

ఉయ్యూరు: చెక్ బౌన్స్ కేసులో ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గండిగుంట గ్రామానికి చెందిన దండమూడి వెంకటరావు వద్ద నుంచి విజయవాడకు చెందిన అత్తలూరి శ్రీనివాసరావు 29 ఆగస్టు 2018న రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కుటుంబ ఖర్చులు నిమిత్తం నగదు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసిఇచ్చారు. బాకీ తీర్చే నిమిత్తం 20 సెప్టెంబర్ 2019న వెంకటరావుకు రూ 4 లక్షల చెక్కును శ్రీనివాసరావు అందించాడు. ఆ చెక్కును వెంకటరావు బ్యాంకులో డిపాజిట్ చేయగా చెక్ బౌన్స్ అయ్యింది. చెక్కు బౌన్స్‌పై ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించారు. బాధితుడు వెంకటరావు తరపున న్యాయవాది టి.చంటిబాబు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావటంతో శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్ష, రూ.5.90 లక్షలు నష్టపరిహారం వెంకటరావుకు అందించాలని న్యాయమూర్తి కె.శ్రీహరి తీర్పునిచ్చారు.

విద్యుత్‌తో చెలగాటం



పెనమలూరు: నిర్లక్ష్యం కారణంగా తరచుగా విద్యుదాఘాతానికి గురై పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రజల్లో చైతన్యం రావటం లేదు. పోరంకిలో సోమవారం ఉదయం ఓ వ్యక్తి ప్రమాదాన్ని సైతం లెక్క చేయకుండా ట్రాన్స్‌ఫారం దిమ్మె ఎక్కి కేబుల్ వైర్లు వేశాడు. విద్యుత్ సరఫరా జరుగుతుండగా వ్యక్తి ట్రాన్స్‌ఫారం దిమ్మె ఎక్కి కేబుల్ వైర్లు లాగటం స్థానికులను కలవర పాటుకు గురి చేసింది. ఇటీవలే పోరంకిలో భవనంపై నుంచి సామాన్లు దింపుతుండగా విద్యుత్ తీగలకు తగిలి వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మరవకముందే కేబుల్ వైర్లు వేసే వ్యక్తులు ఇటువంటి సాహసాలు చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

పెనమలూరు: కానూరులో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కానూరు ఆటోనగర్ ఐదో లైన్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,470 నగదు స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఇన్‌స్పైర్ - మనాక్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక



గన్నవరం: తమ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ సైన్స్ ఇన్‌స్పైర్-మనాక్ అవార్డుకు ఎంపికైనట్లు శ్రీమల్లికార్జున హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ప్రిన్సిపాల్ డి.మాధవీలత తెలిపారు. సోమవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా స్థాయిలో విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ పాఠశాలకు చెందిన ఎం.పాల్‌తేజ, జె.పావని ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరికి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నుంచి ఇన్‌స్పైర్-మనాక్ అవార్డుతో పాటు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎస్.చినవెంకట్రాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

గంగూరులో ఉపవాస ప్రార్థన

పెనమలూరు: పాత గంగూరులో ఆదివారం రాత్రి ఉపవాస ప్రార్థన నిర్వహించారు. క్రైస్తవ తపస్సు కాలం సందర్భంగా 45 రోజుల ఉపవాస దీక్షలను భక్తులు చేపట్టారు. కానూరు కార్మెల్‌మాత దేవాలయం విచారణ గురువులు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు ఘనంగా జరిగాయి దివ్య బలిపూజ కార్యక్రమాలను ఫాదర్ కొలకలూరి సురేష్ సమర్పించారు. ఫాదర్లు దేవదానం, రత్నరాజు భక్తులందరికీ దివ్య ప్రసాదాలు అందజేశారు. దయాసాగర్ గాయక బృందం భక్తి గీతాలు ఆలపించారు.

తిరుపతమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్ల
- కానూరులో అమ్మవారి ఆలయానికి వందేళ్ల చరిత్ర
- 13 సాయంత్రం ప్రభోత్సవం



కానూరులో నూతనంగా నిర్మించిన తిరుపతమ్మ ఆలయం (ఇన్‌సెట్) శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ

పెనమలూరు: కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తిరుపతమ్మ తిరనాళ్లకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు తిరుపతమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర..

కానూరులో శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయాన్ని 100 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. పూర్వం దేవభక్తుని రంగయ్య, చెరుకూరి కోటయ్య భక్తులు కానూరులో శ్రీతిరుపతమ్మవారిని ప్రతిష్టించారు. పిడకలతో గుడి నిర్మించి అమ్మవారికి పూజలు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెనుగ్రంచిప్రోలు అమ్మవారి తిరునాళ్ల తరువాత కానూరులో జరిగే అమ్మవారి తిరనాళ్లకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆ తరువాత అమ్మవారికి దాతలు గుడి నిర్మించగా గుడి కింద భాగం శిథిలమవ్వటంతో నూతన ఆలయ నిర్మాణానికి కమిటీ నిర్ణయించింది. పైగా అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరగటంతో భక్తులకు వసతులు కల్పించటానికి నూతన ఆలయ నిర్మాణం ఆవశ్యకత ఏర్పడింది. గతేడాది ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు నూతన ఆలయ నిర్మాణం పూర్తి చేసి శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మను పునఃప్రతిష్టించారు.

అమ్మవారిపై ప్రగాఢ విశ్వాసం

అమ్మవారికి భక్తులు మొక్కుకుంటే మొక్కులు వెంటనే తీరుతున్నాయన్న ప్రగాఢ విశ్వాసం భక్తుల్లో ఉందని ఆలయ ప్రధాన అర్చకుడు పూరకరణం పవన్‌కుమార్ తెలిపారు. కష్టాల్లో ఉన్న వారు అమ్మవారిని మొక్కుకుంటే సమస్యలు తీరుతాయని భక్తుల నమ్మకమన్నారు. భక్తుల సౌకర్యం కోసం శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ అన్ని వసతులు సమకూర్చింది. ఆలయ ప్రాంగణంలో శుభకార్యాలు నిర్వహించేందుకు రెండంతస్తుల కల్యాణ మండపం కూడా నిర్మాణం చేశారు.

తిరునాళ్ల కార్యక్రమాల వివరాలు

శ్రీ గోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ తిరనాళ్ల మహోత్సవాలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ నెల 12న ఉదయం 6.45 గంటలకు గణపతి పూజ, గోపూజ, దీక్షాధారణ, అంకురారోహణ, పంచామృతాభిషేకం, స్వామివార్లను పట్టువస్త్రాలతో పెళ్లి కుమారుడిని, పెళ్లి కుమార్తెను చేస్తారు. అనంతరం శ్రీ లక్ష్మీగణపతి, రుద్ర వెంకటేశ్వర, మృత్యుంజయ, మహాలక్ష్మి, దుర్గాహోమం తదితర పూజలు చేస్తారు. 13న ఉదయం 5.45 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు పూరకరణం పవన్‌కుమార్‌శర్మచే నిత్య పూజా కార్యక్రమాలు చేస్తారు. ఉదయం 10.58 గంటల నుంచి పొంగళ్లు, బోనాలు భక్తులు అమ్మవారికి సమర్పిస్తారు. సాయంత్రం ఆలయ ప్రభతో పాటు పలు ప్రభలు ప్రభోత్సవం నిర్వహిస్తారు. ప్రభోత్సవంలో గ్రామ పూర్వీకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, బంధువులు పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

స్వామివారి కల్యాణోత్సవం

కాగా 13వ తేదీ రాత్రి 11.15 గంటలకు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి వార్షిక శాంతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం 14వ తేదీ ఉదయం గ్రామోత్సవం జరుగుతుంది. స్వామివార్లకు ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు చేపడతారురు. ప్రముఖ స్మార్త పురోహితుడు కంభంపాటి పార్థసారథి ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు చేస్తారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు భక్తులకు అన్నమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

ఆలయంలో భక్తులకు సౌకర్యాలు



కానూరులో భక్తుల కోసం తిరుపతమ్మకు దాతల సాయంతో నూతన ఆలయం నిర్మించాం. అలాగే శుభ కార్యాలకు కల్యాణ మండపం కూడా నిర్మించాం. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవటానికి అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు ఉచిత ప్రసాదం అందజేస్తాం. ఆలయంలో సౌకర్యాలు భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యుడు, కానూరు

రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటశివయ్య

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో సోమవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీ చేపట్టిన భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.వెంకటశివయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీసర్వే ప్రక్రియలో రైతులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. సదరు రైతులు భూమిపైకి వచ్చి హద్దులు చూపిన తర్వాత సర్వే బృందాలు, ఓఆర్‌ఐలు మార్కు చేస్తారన్నారు. తద్వారా సదరు భూమికి కొత్త ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం) నంబర్ ఇవ్వడంతో పాటు వాటి విస్తీర్ణాన్ని లెక్కకట్టి రైతుల సమక్షంలో ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు. భూమి వాస్తవ కొలతలు, డాక్యుమెంట్‌లో ఉన్న విస్తీర్ణం సరిగా ఉన్నవి, లేనిది రైతులు సరిచూసుకోవాలన్నారు. అనంతరం సదరు భూముల కొలతలపై రైతుల ఆమోదంతోనే రీసర్వే ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం రైతులు వ్యక్తపరిచిన పలు సందేహాలు, అనుమానాలను తహసీల్దారు నివృత్తి చేశారు. జేటీఎస్ లీలాప్రసాద్, మండల సర్వేయర్ మాధవరావు, డీటీ చిట్టిబాబు, వీఆర్వో దియ్యల శ్రీనివాసరావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

100 అడుగుల రోడ్డు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెనమలూరు: తాడిగడప - పెదపులిపాక గ్రామాలను అనుసంధానం చేస్తూ 100 అడుగుల రోడ్డును నిర్మించాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు తాడిగడపలో సోమవారం రైతులు జరిపిన సమావేశంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ ఏలూరు రోడ్డు ఎనికేపాడు నుంచి తాడిగడప జంక్షన్ బందరు రోడ్డు వరకు గతంలో 100 అడుగుల రోడ్డు వేశారన్నారు. జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో 100 అడుగుల రోడ్డును తాడిగడప, పెదపులిపాక గ్రామాల మీదగా కృష్ణా కరకట్టకు కలిపే విధంగా ప్రణాళిక రూపొందించారని వివరించారు. అయితే 100 అడుగుల రోడ్డు నిర్మాణం ఆచరణలో అమలు జరగక ఈ ప్రాంతం అభివృద్ధి చెందలేదని తెలిపారు. రైతులు 100 అడుగుల రోడ్డుకు భూమి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని అయితే రైతులకు నష్టం కలగకుండా పూలింగ్ ఇవ్వాలంటే ఇన్‌కంట్యాక్స్ లేకుండా 1 : 6 నిష్పత్తిలో బాండ్లు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రస్తుతం ఉన్న భూమి విలువను పెంచాలని కోరారు. కొత్తగా 100 అడుగుల రోడ్డు నిర్మాణం చేస్తే ఇన్నర్ రింగ్‌గా ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు.

వేగవంతంగా పీ - 4 సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు మండలంలో అన్ని గ్రామాల్లోనూ వేగవంతంగా పీ - 4 సర్వే కొనసాగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. కడవకొల్లు, వీరవల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు మండల వ్యాప్తంగా 10,909 కుటుంబాలలోని నిరుపేదలను గుర్తించేందుకు సర్వే జరుగుతుందన్నారు గ్రామాల్లో పేదరికంలో ఉన్న 20 శాతం మంది ప్రజలను 16 ప్రశ్నల ద్వారా గుర్తిస్తున్నామన్నారు. ఈ నెల 21వ తేదీన గ్రామసభలు నిర్వహించి నిర్ధారణ అర్హుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. పేద కుటుంబాలను సంపన్న వర్గాలు దత్తత తీసుకొని ఆయా కుటుంబాల అభివృద్ధికి సహకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): రక్తదానం ప్రాణదానంతో సమానమని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ ఎన్.సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ వారి సౌజన్యంతో కళాశాల జాతీయ సేవా సమితి రక్తదాన శిబిరం వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమేనన్నారు. 137 యూనిట్ల బ్లడ్ సేకరించామని డాక్టర్ కేఎస్‌ఆర్కే ప్రసాద్ తెలియజేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్ బండి రామ్మోహనరావు అభినందించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన జాతీయ సేవాసమితి కోఆర్డినేటర్ జి.శేఖర్‌రెడ్డిను లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గాజుల రామారావు, సెక్రటరీ కొండా శ్రీనివాస చౌదరి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

250 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

గన్నవరంరూరల్: పశువుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పశుపోషకులు వినియోగించుకోవాలని ముస్తాబాద పశువైద్య చికిత్సా కేంద్రం డాక్టర్ మేరీ వైడూర్యం సూచించారు. మండలంలోని సావరగూడెం గ్రామంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా పశుపోషకులకు అవగాహన నిర్వహించారు. సకాలంలో టీకాలు వేయడం ద్వారా వ్యాధులను నిర్మూలించటంతో పాటు పశు పోషకులకు ఆర్థిక వృద్ధి కల్పించటం ప్రభుత్వ లక్ష్యమన్నారు. 250 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గ్రామ సర్పంచ్ సర్నాల గంగారత్నం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారత్నం మాట్లాడుతూ ఈ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సర్నాల బాలాజీ, గూడవల్లి సుబ్రహ్మణ్యం, దాసరి నాగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు సబ్సిడీపై ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు బాపులపాడు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 174 మంది రైతులకు వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్, రోటోవేటర్, పవర్ వీడర్, బుష్ కట్టర్లను రాయితీపై రైతులకు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఏవో తెలిపారు.

ఘర్షణలో ఇంటర్ విద్యార్థులకు గాయాలు



ఉయ్యూరురూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఉయ్యూరు పట్టణంలో ద్వితీయ సంవత్సర విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం రాసి బయటకు వచ్చిన అనంతరం గ్రూపులుగా విడిపోయి వాగ్వాదానికి దిగారు. కోట కాంప్లెక్స్ వద్ద బాహాబాహీకి దిగి ఒకరిపై ఒకరు పక్కనే ఉన్న కిరణా షాప్‌లోని కూల్‌డ్రింక్స్ బాటిల్స్, ట్రేలు విసురుకొని దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. ఘటన జరిగిన ప్రాంతంలో లభించిన హాల్ టికెట్ల ఆధారంగా విచారణ చేస్తున్నామని ఎస్ఐ విశ్వనాథ్ చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద హైవేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దాటిన తర్వాత రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువత పోరుకు సిద్ధం కావాలి

ఈ నెల 12న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కానూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు

పెనమలూరు: గత ఎన్నికల్లో యువతకు కూటమి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చూస్తూ జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు యువత పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నేతలు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, నిరుద్యోగ భృతి, ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు కావొస్తున్నా నేటికి విద్యార్థులకు బకాయి ఉన్న రూ.4,500 కోట్లు సొమ్ము విడుదల చేయలేదని ఆరోపించారు. నేడు విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువులకు స్వస్తి పలుకుతున్నారని, పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థుల జీవితాలతో బాబు చెలగాటం..

విద్యార్థుల జీవితాలతో సీఎం చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. మెడికల్ సీట్లు ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, దీని వలన భవిష్యత్తులో పేద విద్యార్థులు వైద్య చదువు చదవలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. యువత పక్షాన జగనన్న ఉన్నారని, యువతకు న్యాయం చేయటానికి జగనన్న యువత పోరు ప్రకటించారని తెలిపారు. ఈ నెల 12వ తేదీన జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.రాఘవరావు, వేమూరి బాలకృష్ణ, సత్తా వెంకటేశ్వరరావు, కర్రా ఆదిశేషారావు, హక్, అష్రఫ్, మాదు శ్రీహరి రాణి, రామినేని రమాదేవి, బిందుమాధవి, కర్రా జోజిమేరి, దిరిశం ఇందిరా, పోలవరపు రవి, శీలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవాలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో గోపయ్య స్వామి, తిరుపతమ్మ తల్లి కల్యాణం సోమవారం కనులపండువగా జరిగింది. భక్తజనుల జయజయ ధ్వనాల నడుమ కల్యాణోత్సవం శోభయామనంగా సాగింది. రకరకాల పూలతో కల్యాణ మండపాన్ని విశేషంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి కల్యాణానికి ఆనవాయితీ ప్రకారం లంక వంశీస్తులు తరుపున కోనేరు కోటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణం తిలకించేందుకు పరసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమైంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు.

ఆలయ ధర్మకర్త నందమూరి కృష్ణప్రసాద్, గ్రామ ప్రముఖులు లంక రవి శ్రీనివాస్, కలపాల రాజాబాబు, ఆత్మూరి బాలాజీ, గుండపనేని ఉమావరప్రసాద్, సర్పంచ్ పిల్లా అనిత, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

తెన్నేరులో తిరునాళ్ల..

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. అమ్మవారి కల్యాణాన్ని భక్తజనం భక్తితో తిలకించారు. అనంతరం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం కనులపండువగా సాగింది. గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. కోలాట ప్రదర్శనను భక్తులు తిలకించి చిన్నారులను అభినందించారు. కోలాటం గురువు కోలవెన్ను దాలియా చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

కానూరులో భారీ అన్నసమారాధన



కానూరులో అన్నసంతర్పణ చేస్తున్న దేవినేని అవినాష్, చక్రవర్తి తదితరులు

పెనమలూరు: కానూరులో శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలో భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానం ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో రెండు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం చేశారు. సోమవారం ఉదయం వసంతోత్సవం అనంతరం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. 10 వేల మంది భక్తులను అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చైతన్య యాత్ర

పెనమలూరు: ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో తాడిగడప గ్రామంలో సోమవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం నాయకులు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. వాటిని అధికారులకు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నేతలు పుసులూరి లక్ష్మీనారాయణ, వీసం సోమశేఖర్, సీహెచ్ రాంబాబు, పి.సత్యనారాయణ, సీహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లంకపల్లిలో ప్రజా చైతన్య యాత్ర

ఉంగుటూరు: మండలంలోని లంకపల్లిలో సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రను సోమవారం నిర్వహించారు. మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రధానంగా డ్రెయినేజీ, తాగునీరు, అర్హత ఉన్నవారికి పింఛన్లు, పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని తదితర సమస్యలను చైతన్య యాత్ర దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, ఉదయ్ కుమార్, మార్టిన్ కైలా ప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్‌ల అందజేత



విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల చేయూత అభినందనీయమని ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.అరుణకుమారి అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు పతం రామకృష్ణ, సన్నాల ప్రసాద్‌ల వితరణతో పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పరీక్ష కిట్‌లను సోమవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అండగా నిలవటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పి.నాగమణి, సన్నాల సాయికిరణ్, పతం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు కల్వరి శక్తి మినిస్ట్రీస్(వేలేరు) ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. వేలేరు, రేమల్లే, మల్లవల్లి, కానుమోలు, అప్పనవీడులోని జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న దాదాపు 300 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్ను, జామెట్రీ బాక్స్‌లతో కూడిన ఎగ్జామ్ కిట్‌ను పాస్టర్ భూక్యా బాలరాజు పంపిణీ చేశారు. త్వరలో జరగబోయే పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులు కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు బాలరాజు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.